www.kalamdaily.com

# కలం
ప్రజల గళం...

Follow on: Kalamtelugu

18-02-2026, బుధవారం

360° SINGLE PAGE TOPIC

## పార్టీ ఫిరాయింపులు

**వార్డు కౌన్సిలర్ మొదలు..**
**పార్లమెంట్‌లో జనం గొంతు వినిపించే**
**ఎంపీ వరకు జంపింగ్ జపాంగ్‌లే!**
కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. ఎవరూ ఏం తక్కువ కాదు. పదవుల కోసం కొందరు.. పైసల కోసం మరికొందరు.. పవర్ కు భయపడి ఇంకొందరు.. ఆయా రాం, గయా రాం బాపతే!!
**గెలిచిన వెంటనే.. సొంత పార్టీ గురించి పట్టదు,**
**గెలిపించిన ఓటరూ పట్టడు.**
**ప్లేటు ఫిరాయించుడు, కండువా మార్చుడే!!**

పార్టీ ఫిరాయింపులకు 'ఘన'మైన చరిత్రే ఉంది. ఏకంగా పదేండ్లలో 13 సార్లు ప్రభుత్వాలను కూలగొట్టిన హిస్టరీ ఉంది. తెలంగాణలో ఏకంగా సీఎల్పీనే విలీనం చేసుకున్న రికార్డు గత బీఆర్ఎస్ పాలన సొంతం. ఇప్పుడు 10 మంది ఎమ్మెల్యేలు అటు అధికార పార్టీనో.. ఇటు ప్రతిపక్ష పార్టీనో తెలియని పరిస్థితి. రాజీవ్ గాంధీ తెచ్చిన 'యాంటీ-డిఫెక్షన్ లా' ఉన్నా.. అందులోని లొసుగులను లీడర్లు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. కేంద్రంలో మోదీ సర్కార్ వచ్చాక దేశవ్యాప్తంగా ఎక్కువ ఫిరాయింపులు జరిగింది బీజేపీలోకే! అందుకే 'వాషింగ్ పౌడర్ నిర్మా' ట్రెండింగ్!!

పార్టీ ఫిరాయింపులపై
కలం 360 డిగ్రీస్ స్పెషల్...


- తెలంగాణ బ్యూరో, కలం

### ఆయా రాం.. గయా రాం ఫేమస్!

1967లో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. హంగ్ ఏర్పడింది. కాంగ్రెస్ కు ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు అవసరం. హసన్‌పూర్ (ప్రస్తుతం హోడల్) నుంచి ఇండిపెండెంట్ గా గెలిచిన గయా లాల్ తొలుత కాంగ్రెస్ లో చేరారు. ఆ తర్వాత యునైటెడ్ ఫ్రంట్‌లోకి మారారు. తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారు. ఇలా గయా లాల్ ఒకేరోజు 9 గంటల వ్యవధిలో మూడుసార్లు పార్టీలు మారి సంచలనం సృష్టించారు. గయా లాల్ రెండోసారి కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చినప్పుడు ఆయనను అప్పటి కాంగ్రెస్ నేత రావ్ బీరేంద్ర సింగ్ మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఆ సందర్భంలో "అప్పుడు గయారాం.. ఇప్పుడు ఆయారాం" అని నవ్వుతూ చెప్పారు. అలా ఇది అప్పటి నుంచి ఫేమస్ . భారత్‌లోనే కాదు.. ఇతర దేశాల్లోనూ దీన్నే ఫిరాయింపులపై విమర్శలకు వాడుతుంటారు.

### ఇదీ చెరగని జంపింగ్ చరిత్ర..!

- 1967-1971 కాలంలో దేశవ్యాప్తంగా 142 మంది ఎంపీలు, వందల మంది ఎమ్మెల్యేలు పార్టీలు ఫిరాయించారు. దీనివల్ల అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కుప్పకూలిపోయాయి. 1969లో కాంగ్రెస్‌లో చీలిక వచ్చింది. ఇది మరిన్ని ఫిరాయింపులకు దారితీసింది.
- 2014 నుంచి 2021 మధ్య సుమారు 600 మంది ఎంపీలు/ఎమ్మెల్యేలు పార్టీలు మారారు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. ఇవి ఏడీఆర్, ఇతర సంస్థల రిపోర్టులు చెప్తున్న లెక్కలు.





# గోడమీది పిల్లి!

### తొలిసారి ఏ రాష్ట్రంలో..

దేశంలో 1950లోనే పార్టీ ఫిరాయింపులు మొదలయ్యాయి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో చౌదరి చరణ్ సింగ్ నాయకత్వంలో దాదాపు 24 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ను వీడి 'జన కాంగ్రెస్' అనే కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. ఇదే దేశంలో తొలి పార్టీ ఫిరాయింపుగా చరిత్రకెక్కింది.

**తాజాగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో లీడర్ల తీరు చర్చనీయాంశమైంది. కౌన్సిలర్లుగా, కార్పొరేటర్లుగా ఇలా గెలిచారో లేదో.. అలా ప్లేట్ ఫిరాయించారు. గోడమీది పిల్లివాటం ప్రదర్శించారు. వారిని కాపాడుకునేందుకు పార్టీలు క్యాంపులు పెట్టాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో.. మేయర్, చైర్‌పర్సన్ ఎన్నికలో ఎవరు చెయ్యి ఎత్తుతారో, ఎవరు చెయ్యిస్తారో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది.**

### పదేండ్లలో 13 మంది సీఎంలు

గోవా రాజకీయ చరిత్రలో 1990-2000 మధ్య కాలాన్ని రాజకీయంగా 'అస్థిరతకు పరాకాష్ట'గా పిలుస్తారు. ఈ పదేండ్ల కాలంలో ఏకంగా 13 మంది ముఖ్యమంత్రులు మారారు. ఇందుకు కారణం.. పార్టీ ఫిరాయింపులు, పార్టీల్లో అంతర్గత విభేదాలు. అప్పుడు ఎమ్మెల్యేలు హోల్‌సేల్‌గా పార్టీలు మారేవారు.



### సీఎల్పీనే విలీనం చేసుకున్న కేసీఆర్!


- తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 63 సీట్లు సాధించి అధికారంలోకి వచ్చింది. మ్యాజిక్ ఫిగర్ కంటే 3 సీట్లే ఎక్కువగా ఉన్నప్పటికీ ఆనాటి సీఎం కేసీఆర్.. టీడీపీలోని 15 మంది ఎమ్మెల్యేల్లో 12 మందిని, కాంగ్రెస్‌లోని 21 మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురిని తన పార్టీలో చేర్చుకున్నారు.
- 2018 ఎన్నికల్లో 88 సీట్లతో బీఆర్ఎస్ విజయం సాధించింది. కేసీఆర్ రెండోసారి సీఎం అయ్యారు. అప్పుడు కాంగ్రెస్ నుంచి గెలిచిన 19 మంది ఎమ్మెల్యేల్లో 12 మంది ఒకేసారి బీఆర్ఎస్‌లో చేరారు. వీళ్లంతా స్పీకర్‌ను కలిసి కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని బీఆర్ఎస్ ఎల్పీలో విలీనం చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష హోదాను కోల్పోయింది. ఇక టీడీపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు.

### ఫిరాయింపుల కట్టడికి చట్టం ఉన్నా..!

- పార్టీ ఫిరాయింపులు రాజకీయ అస్థిరత్వాన్ని సృష్టించడంతో 1968లో ఇందిరాగాంధీ హయాంలో అప్పటి కేంద్ర హోం మంత్రి వైబీ చవాన్ ఆధ్వర్యంలో మేధావులు, రాజకీయ దిగ్గజ నేతలతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటైంది. ఫిరాయింపులకు ప్రధాన కారణం పదవీకాంక్ష, డబ్బు! అందుకే మంత్రి మండలి సభ్యుల్లో కేంద్రంలో, రాష్ట్రాల్లో 10 శాతం నుంచి 11 శాతం మించకూడదని కమిటీ నిర్ణయించింది. రాజకీయ అస్థిరతను అరికట్టడానికి కఠినమైన చట్టాన్ని రూపొందించాలని.. ఒకపార్టీ గుర్తుపై గెలిచి, ఆ పార్టీని వీడి మరోపార్టీలో చేరిన వ్యక్తిని ఏడాదిపాటు, తిరిగి ఎన్నికయ్యేవరకు మంత్రి పదవుల్లో నియమించకూడదని సిఫార్సు చేసింది. పార్టీ ఫిరాయింపులను ' నేషనల్ డిసీజెస్' గా పేర్కొంది. అయితే, అప్పట్లో చవాన్ కమిటీ సిఫారసులపై రాజకీయంగా ఏకాభిప్రాయం కుదరక చట్టంగా మారలేదు.
- 1985లో ప్రధాని రాజీవ్ గాంధీ హయాంలో 52 రాజ్యాంగ సవరణ (10 షెడ్యూల్)కు చవాన్ కమిటీ నివేదికనే పునాది వేసింది. ఆ సిఫార్సుల మేరకు యాంటీ -డిఫెక్షన్ లా తెచ్చారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడే సభ్యులపై అనర్హత వేటు వేసే నిబంధనలు చేశారు. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టాన్ని మరింత పటిష్టం చేశారు. పార్టీ మారే సభ్యులకు కఠిన నిబంధనలు విధించారు. ఎంపీలు లేదా ఎమ్మెల్యేలు పార్టీ మారితే అనర్హత వేటు పడుతుంది. అయితే, పలువురు ప్రజాప్రతినిధులు చట్టానికి చిక్కకుండా పార్టీలు ఫిరాయిస్తున్నారు. గెలిచిన పార్టీలోనే ఉన్నామంటూ గోడమీది పిల్లివాటం ప్రదర్శిస్తున్నారు.

### కూలిన ప్రభుత్వాలు

- 2019లో కర్నాటకలో 'ఆపరేషన్ లోటస్' కారణంగా కుమారస్వామి సర్కార్ కుప్పకూలింది. 2018 ఎన్నికల్లో బీజేపీకి 104, కాంగ్రెస్‌కు 80, జేడీఎస్ కు 37 సీట్లు వచ్చాయి. యడ్యూరప్ప సీఎంగా ప్రమాణం చేసినా.. మెజారిటీ నిరూపించుకోలేకపోవడంతో 48 గంటల్లోనే రిజైన్ చేశారు. కాంగ్రెస్, జేడీఎస్ కలిసి కుమారస్వామి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. 2019లో కాంగ్రెస్, జేడీఎస్‌కు చెందిన 17 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ అనుమతించకుండా అనర్హత వేటు వేశారు. 2019 జులై 23న అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. 17 మంది గైర్హాజరుతో కుమార స్వామి ప్రభుత్వానికి 99 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 105 ఓట్లు వచ్చాయి. మెజారిటీ నిరూపించుకోలేక కుమార స్వామి పదవికి రాజీనామా చేశారు.
- మహారాష్ట్రలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమికి 161 సీట్లు (బీజేపీకి 105, శివసేన 56) వచ్చాయి. కానీ, సీఎం పదవి వివాదంలో విడిపోయారు. ఎన్సీపీ (54), కాంగ్రెస్ (44)తో కలిసి సీఎంగా ఉద్ధవ్ ఠాక్రే మహా వికాస్ అఘాడి సర్కార్ ఏర్పాటు చేశారు. శివసేనలోని ఒక వర్గం (షిండే) కాంగ్రెస్, ఎన్సీపీతో పొత్తును వ్యతిరేకించింది. 2022 జూన్ 21న షిండే నేతృత్వంలో 11 మంది ఎమ్మెల్యేలు రిసార్ట్‌లకు వెళ్లారు. కొన్ని రోజులకు 40 మంది శివసేన ఎమ్మెల్యేలు, 10 మంది స్వతంత్రులు షిండే సైడ్ వచ్చేశారు. బలపరీక్షలో ఓటమి తప్పదని గ్రహించి ఉద్ధవ్ సీఎం పదవికి రిజైన్ చేశారు.



### రేవంత్‌కు టచ్‌లో 10 మంది

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు టచ్ లో ఉంటున్నారు. తాము కాంగ్రెస్ లో చేరలేదని, నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే సీఎం రేవంత్‌ను కలిశామని చెప్తున్నారు. వీళ్లపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ పిటిషన్లపై విచారణ కొనసాగుతున్నది.




### ఏపీలో అటు ఇటు.. ఇటు అటు

- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఏపీలో 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. వైసీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు టీడీపీలో చేరారు.
- 2019 ఎన్నికల్లో 151 సీట్లతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. టీడీపీ 23 సీట్లు గెలుచుకుంది. ఆనాడు టీడీపీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు, జనసేన నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే వైసీపీకి మద్దతు పలికారు.

### గంపగుత్తగా..!

- **మధ్యప్రదేశ్:** 2020లో 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో బీజేపీలో చేరారు.
- **గోవా:** 2019–2022 మధ్య 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు.
- **అరుణాచల్‌ప్రదేశ్:** 2016లో 43 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో జాయిన్ అయ్యారు.
- **మణిపూర్:** 2017లో 8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమలం గూటికి చేరుకున్నారు.
- **ఉత్తరాఖండ్:** 2016లో 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి చేరారు.
- **రాజస్థాన్ :** 2019లో ఆరుగురు బీఎస్పీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు.




### ఎక్కువసార్లు మారింది వీళ్లే

- **సుబ్రతా ముఖర్జీ:** కాంగ్రెస్, జనతాపార్టీ, టీఎంసీ.
- **చగన్ భుజ్‌లాల్:** శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీ.
- **నారాయణ్ రాణే:** శివసేన, కాంగ్రెస్, బీజేపీ.
- **జ్యోతిరాదిత్య సింధియా:** కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి మారి మధ్యప్రదేశ్ రాజకీయాలను మలుపు తిప్పారు.
- **హిమంత బిశ్వ శర్మ:** కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి మారి అస్సాం ముఖ్యమంత్రి అయ్యారు.
- **ముకుల్ రాయ్:** తృణమూల్ నుంచి బీజేపీలోకి.. మళ్లీ తృణమూల్‌కు వెళ్లారు.
- **నితీశ్ కుమార్:** పార్టీ మారలేదు కానీ, 'కూటమి'లను పలుమార్లు మార్చి రికార్డు సృష్టించారు. 2014 నుంచి ఇప్పటివరకు సుమారు 5 సార్లు ఎన్డీయే నుంచి మహాకూటమికి, మళ్లీ ఎన్డీయేకి మారారు.



### ఉమ్మడి ఏపీలో నాదెండ్ల

ఎన్టీఆర్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన నాదెండ్ల భాస్కర్‌రావు.. తన వర్గ ఎమ్మెల్యేలతో పార్టీ ఫిరాయించారు. కాంగ్రెస్ మద్దతుతో సీఎం అయ్యారు. 1983లో టీడీపీ గెలువగా, ఎన్టీఆర్ సీఎం అయ్యారు. 1984 ఆగస్టులో ఆయన ట్రీట్‌మెంట్ కోసం అమెరికా వెళ్లారు. ఆ టైమ్‌లో నాదెండ్ల భాస్కర్‌రావు తన వర్గ ఎమ్మెల్యేలను కూడగట్టుకున్నారు. ఎన్టీఆర్ అమెరికా నుంచి తిరిగి రాగానే.. తనకు తగినంత మంది ఎమ్మెల్యేల బలం ఉందని గవర్నర్ రామ్‌లాల్‌ను నాదెండ్ల కలిశారు. ఆనాడు కేంద్రంలో కాంగ్రెస్ సర్కార్ ఉంది. మెజారిటీ నిరూపించుకోవడానికి ఎన్టీఆర్ గడువు కోరినప్పటికీ, గవర్నర్ ఇవ్వలేదు. నాదెండ్లతో సీఎంగా ప్రమాణం చేయించారు. పదవి కోల్పోయిన ఎన్టీఆర్.. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం చేపట్టి, రాష్ట్రవ్యాప్తంగా తిరిగారు. ప్రజావ్యతిరేకత, రాజకీయ ఒత్తిడితో గవర్నర్ రామ్‌లాల్ రాజీనామా చేయాల్సి వచ్చింది. నాడు కొత్త గవర్నర్ శంకర్ దయాళ్ శర్మ అసెంబ్లీలో బలపరీక్షకు ఆదేశించారు. నాదెండ్ల మెజారిటీని నిరూపించుకోలేకపోవడంతో ఎన్టీఆర్ తిరిగి సీఎం అయ్యారు.



### పల్టీ పాలిటిక్స్

బిహార్‌లో ప్రభుత్వాలు మారడానికి ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీలైన జేడీయూ, ఆర్జేడీ మధ్య సంబంధాలే. ఇక్కడ బీజేపీ ఉన్నప్పటికీ, నిర్ణయాధికారం పూర్తిగా ప్రాంతీయ పార్టీ నేత నితీశ్ కుమార్ చేతుల్లోనే ఉంది. 2015లో ఆర్జేడీ, కాంగ్రెస్‌తో కలిసి నితీశ్ ప్రభుత్వం ఏర్పాటైంది. 2017లో అవినీతి ఆరోపణల సాకుతో కూటమి నుంచి బయటికొచ్చి ప్రభుత్వాన్ని కూల్చారు. వెంటనే బీజేపీతో కలిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 2022లో మళ్లీ బీజేపీని ఆర్జేడీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 2024లో ఎన్నికలకు ముందు మళ్లీ ఆర్జేడీని వదిలి బీజేపీలో కూటమిలోకి వచ్చారు. దీన్ని 'పల్టీ పాలిటిక్స్' అని పిలుస్తుంటారు.

### రివర్స్ మైగ్రేషన్

2014 నుంచి 2025 వరకు బెంగాల్ రాజకీయాల్లో టీఎంసీ నుంచి ఫిరాయింపులు సాగాయి. చాలా మంది నేతలు ఎన్నికలకు ముందు టీఎంసీని వీడి బీజేపీలో చేరారు. కానీ, ఎన్నికల తర్వాత మళ్లీ టీఎంసీలోకి వచ్చారు. దీన్ని 'రివర్స్ మైగ్రేషన్' అని పిలుస్తారు. 2019లో సువేందు అధికారి.. బీజేపీలో చేరి, నందిగ్రామ్‌లో మమతపైనే గెలిచారు. 2021 ఎన్నికలకు ముందు 30 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 2021 ఎన్నికల్లో మమతా బెనర్జీ విజయం తర్వాత.. బీజేపీలోకి వెళ్లినవాళ్లలో చాలా మంది తిరిగి టీఎంసీకి క్యూ కట్టారు.

